

సెంగోట్టయ్యన్‌పై
త్వరలో బహిష్కరణ వేటు ?

అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్‌పై బహిష్కరణ వేటు పడనుందా... అతను మరో పర్యాయం విలీనం పాట ఎత్తుకున్నా... మాజీ సీఎం ఓపీఎస్, శశికళతో భేటీ అయినా పార్టీ నుంచి శాశ్వతంగా దూరం కావడం తథ్యమనే అంటున్నారు ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు..



చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జయలలిత మృతి తర్వాత అన్నాడీఎంకే నుండి విడిపోయినవారినందరినీ విలీనం చేసుకుని అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగాలని పిలుపునిచ్చి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కి పది రోజులు గడువిచ్చిన ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్‌ను పార్టీ నుండి శాశ్వతంగా బహిష్కరించేందుకు రంగం సిద్ధమైంది. గత రెండేళ్లుగా ఈపీఎస్‌కు ఆయనకు మధ్య తీవ్ర మనస్పర్థలు ఏర్పడ్డాయి. అవినాశి అత్తికడవు సాగు నీటి పథకం వల్ల లబ్ధిపొందిన రైతులు ఈపీఎస్‌ను సత్కరించిన సభలో ఎంజీఆర్, జయలలిత ఫొటోలు లేదని తొలిసారిగా సెంగోట్టయ్యన్ అలక పాన్పు పాటించారు. ఆ తర్వాత ఈపీఎస్ పాల్గొనే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న మీడియా సమావేశం ఏర్పాటు చేసి, పార్టీ నుండి విడిపోయిన మాజీ సీఎం ఓ. పన్నీర్‌సెల్వం (ఓపీఎస్), శశికళ, దినకరన్ తదితర నేతలందరినీ పార్టీలో చేర్చుకుని అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లాలని ఈపీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. విలీనం దిశగా ఈపీఎస్ చర్యలు తీసుకోకపోతే తానే రంగంలోకి దిగి అందరినీ ఒక్కటి చేస్తానని కూడా హెచ్చరించారు. అదే సమయంలో సెంగోట్టయన్ వద్ద నున్న పార్టీ పదవులనుండి తొలగించి, వెంటనే ఇతరులకు ఆ పదవులను కట్టబెట్టి ఈపీఎస్ షాక్ ఇచ్చారు. ఆ తర్వాత సెంగోట్టయ్యన్ హరిద్వార్ వెళుతున్నానని చెప్పి ఢిల్లీ వెళ్ళి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. దీంతో పార్టీలో విలీన ప్రయత్నాలు ప్రారంభించేందుకు సెంగోట్టయ్యన్‌కు అమిత్‌షా పచ్చజెండా ఊపారని ఊహాగానాలు చెలరేగాయి. ఢిల్లీ నుండి తిరిగొచ్చిన సెంగోట్టయ్యన్ విలీనం ప్రయత్నాలు చేపట్టకుండా ఊరుకున్నారు. ఆ తరువాత ఈపీఎస్ ఢిల్లీ వెళ్ళి అమిత్‌షాతో భేటీ అయి నగరానికి తిరిగొచ్చి విడిపోయినవారిని మళ్ళీ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని ప్రకటించడంతో సెంగోట్టయ్యన్, ఆయన అనుచరులు ఖంగు తిన్నారు. ఈపీఎస్ అంతటితో ఆగకుండా అన్నాడీఎంకే పార్టీ వ్యవహారాల్లో బీజేపీ తలదూర్చే ప్రసక్తేలేదని అమిత్‌షా తనకు తెలియజేశారన్నారు. ఈ పరిస్థితులలో సెంగోట్టయ్యన్ మళ్ళీ విలీనం పాటందుకుని ప్రయత్నాలు చేపడితే పార్టీ నుండి శాశ్వతంగా బహిష్కరించాలని నిర్ణయించినట్టు ఈపీఎస్ అనుచరులైన మాజీ మంత్రులు కొందరు తెలిపారు. సెంగోటయ్యన్ ఎంజీఆర్ కాలం నుండి పార్టీలో ఉన్న సీనియర్ నేత కనుక ఆయనను పార్టీ నుండి శాశ్వతంగా బహిష్కరించాలని పార్టీ అధిష్ఠానం భావించడం లేదని, అయితే మళ్ళీ విలీన యత్నాలు ప్రారంభిస్తే బహిష్కరణ వేటు తప్పదన్నారు. అదే సమయంలో ఓపీఎస్, శశికళతో సెంగోట్టయ్యన్ భేటీ అయితే పార్టీ నుండి ఆయన శాశ్వతంగా దూరం కావటం తథ్యమని కూడా మాజీ మంత్రులు పేర్కొన్నారు.



సచివాలయంలో 'దిశ' సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

ఎంపీ గ్రాంట్ రూ.10 కోట్లకు పెంచాలి

● కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన సీఎం స్టాలిన్

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సభ్యుల నిధిని రూ.10 కోట్లకు పెంచాలని ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సచివాలయంలో శుక్రవారం ఉదయం రాష్ట్రస్థాయి ఐదో ప్రణాళికా సమావేశం సీఎం స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్.మురుగానందం ఈ సమావేశం ప్రత్యేకత వివరించారు. సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 3.38 లక్షల స్వయం సహాయక బృందాలు, నగర ప్రాంతాల్లో 1.41 లక్షల స్వయం సహాయక బృందాల్లో 55.12 లక్షల మంది సభ్యులున్నారని, వీరికి రూ.67.97 కోట్లు కార్పస్ ఫండ్‌గా, కమ్యూనిటీ డిపాజిట్‌గా రూ.801.62 కోట్లు, గ్రామాల్లో కరువు నివారణకు రూ.75.73 కోట్లు, వృద్ధులు, దివ్యాంగులు, హిజ్రాలు, గిరిజనులతో కూడిన 25,001 ప్రత్యేక స్వయం సహాయక బృందాలకు రూ.25.85 కోట్లు ఇప్పటివరకు పంపిణీ చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి కింద ఒక్కో ఎమ్మెల్యేకు ఒక ఆర్థిక సంవత్సరానికి రూ.3 కోట్లు చొప్పున 234 నియోజకవర్గాలకు రూ.702 కోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వమే ఎమ్మెల్యేలకు నిధులు పెంచిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతుగా ఒక్కొక్క పార్లమెంటు సభ్యుడి గ్రాంట్ రూ.10 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి సాగునీటి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం 60 శాతం నిధుల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలుచేస్తున్నామన్న సీఎం, దీని వలన బిందు సేద్యం, చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం రాయితీ, మిగతా రైతులకు 455 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో చిన్నారుల సంరక్షణ కేంద్రాల్లో లబ్ధిపొందుతున్న సుమారు 22 లక్షల మంది పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందజేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే తమిళనాడులో మాత్రమే మొట్టమొదటి సారిగా ఈ పథకం పరిచయం చేశామన్నారు. అలాగే, చిన్నారుల సంరక్షణ కేంద్రాల్లో సుమారు 10.86 లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనం, వారంలో మూడు రోజులు కోడిగుడ్లు అందజేస్తున్నట్లు సీఎం తెలిపారు.

రోబో శంకర్‌కు పలువురి నివాళి 7



వేలునాచ్చియార్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో సీఎం స్టాలిన్, మంత్రులు, అధికారులు

గాంధీమండపంలో వేలునాచ్చియార్ విగ్రహం

● ఆవిష్కరించిన సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి గాంధీ మండపం వద్ద స్వాతంత్ర్య సమరయోధురాలు, తమిళ ధీరవనిత వీరమంగై వేలునాచ్చియార్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఆ విగ్రహానికి పూలమాల వేసి, చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. 1780లో శివగంగ సంస్థానం రాణిగా వేలునాచ్చియార్ ఆంగ్లేయుల వశమైన తన రాజ్యానికి విముక్తి కలిగించేందుకు భీకర యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో ఆంగ్లేయులను చిత్తుగా ఓడించి శివగంగసీమకు విముక్తి కలిగించారు. పదహారేళ్ల పాటు శివగంగసీమను పరిపాలించి 1796లో స్వర్గస్థులయ్యారు. ఆ ధీరవనితను భావతరాలవారు స్మరించుకునేలా రూ.50లక్షలతో నిలువెత్తు కాంస్యవిగ్రహాన్ని నెలకొల్పినట్లు స్టాలిన్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఈవీ వేలు, ఎస్ రఘుపతి, కేఆర్ పెరియకరుప్పన్, సామినాథన్, ఆర్ఎస్ రాజకన్నప్పన్, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, టీఆర్బీ రాజా, కార్పొరేషన్ మేయర్ ప్రియా, ఎంపీలు టీఆర్ బాలు, తమిళచ్చి తంగపాండ్యన్, ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రాజా, ఆరవింద్ రమేష్, కే గణపతి, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్ మాజీ మంత్రి అన్వర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

కలైంజర్ భవనం ప్రారంభం...

గిండిలోని హైవేస్ రిసెర్చ్ సెంటర్ వద్ద జరిగిన మరో కార్యక్రమంలో ఆ ప్రాంగణంలో హైవేస్ శాఖ ఆధ్వర్యంలో రూ.29కోట్లతో నిర్మించిన కలైంజర్ శతజయంతి స్మారక భవనానికి ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభోత్సవం చేశారు. ఆ భవనసముదాయంలో రాష్ట్ర ప్రధాన రహదారుల సంస్థ (టాన్షా- తమిళనాడు స్టేట్ హైవేస్ అథారిటీ)ను ప్రారంభించి, లోగో ఆవిష్కరించారు.



కలైంజర్ శతజయంతి స్మారక భవనాన్ని ప్రారంభిస్తున్న స్టాలిన్

టి.నగర్ నూతన ఫ్లై ఓవర్ పటిష్ఠత పరిశీలన

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా, టి.నగర్ ఉస్మాన్ రోడ్డు నుంచి అన్నా సాలై వరకు రూ.131 కోట్లతో కొత్త ఫ్లై ఓవర్ నిర్మాణపనులు 2023 మార్చిలో ప్రారంభమయ్యాయి. ఆ ప్రకారం, టి.నగర్ దురైస్వామి రోడ్డు-ఉస్మాన్ రోడ్డు ఫ్లై ఓవర్ దక్షిణ భాగం నుంచి సౌత్ ఉస్మాన్ రోడ్డు మీదుగా అన్నాసాలై జంక్షన్ వరకు 1.2 కి.మీ మేర నిర్మాణం జరుగుతోంది. ఈ ఫ్లై ఓవర్ 50 ఇనుప స్తంభాలపై 7.5 మీటర్ల వెడల్పుతో డబుల్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మద్రాసు ఐఐటీకి చెందిన అరుళ్ జయచంద్రన్ నేతృత్వంలోని నిపుణుల బృందం, ఫ్లై ఓవర్ పటిష్ఠతను శుక్రవారం పరిశీలించింది. ఫ్లై ఓవర్‌పై 20 టన్నుల బరువైన లారీని, 20,30,40 కి.మీ వేగంతో నడిపి పరిశీలించారు. అదేవిధంగా 3 టన్నుల బరువున్న మూడు కాంక్రీట్ దిమ్మెలను ఫ్లై ఓవర్‌పై ఉంచి పరిశీలించారు. ఈ బరువు 152 టన్నులకు పెంచి 24 గంటలు పరీక్షించనున్నారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ... టి.నగర్ కొత్త ఫ్లై ఓవర్‌పై బరువులు పెంచుతూ దాని పటిష్ఠత పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుత పరిశోధనల్లో వంతెన వంద శాతం పటిష్ఠంగా ఉందని, ఈ వంతెన ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తర్వాత, 15 రోజులకు పైగా వంతెన నుంచి శబ్దాలు, కంపనాలు వస్తుంటాయని తెలిపారు. ఫ్లై ఓవర్ భారాన్ని భరించేలా రూపొందించిన 'బ్రిడ్జి బేరింగ్' నిర్మాణం స్థిరంగా మారే వరకు ఈ శబ్దం, కంపనాలు వస్తుంటాయని, వాహన చోదకులు ఈ విషయమై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే ఈ ఫ్లై ఓవర్ ప్రజల అందుబాటులోకి వస్తుందని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.



వంతెన పటిష్ఠత పరిశీలిస్తున్న మద్రాసు ఐఐటీ నిపుణుల బృందం

హీరో విజయ్ నివాసంలో
ఆగంతకుడి చొరబాటు

● 'వై' కేటగిరీ భద్రతా వైఫల్యమా?



విజయ్ నివాసం

అడయార్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళ ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ నివాసంలో గుర్తు తెలియని అగంతకుడు చొరబడ్డాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన తీవ్ర కలకలం సృష్టించింది. కట్టుదిట్టమైన 'వై' కేటగిరీ భద్రత కలిగిన విజయ్ నివాసంలో ఆ అగంతకుడు ఎలా ప్రవేశించాడన్న దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. చెన్నై నగర శివారు ప్రాంతమైన ఈసీఆర్ రోడ్డు నీలాంకరైలోని విజయ్ నివాసం టెర్రస్‌పై అగంతకుడు దాక్కున్నాడు. గురువారం పగలంతా టెర్రస్‌పైనే ఆహారం లేకుండా గడిపాడు. శుక్రవారం ఉదయం విజయ్ మార్నింగ్ వాక్ కోసం టెర్రస్‌పైకి వెళ్ళగా, ఆ అగంతకుడు పరుగున వచ్చి హగ్ చేసుకోవడంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన విజయ్.. ఆ తర్వాత తేరుకుని, ఆ అగంతకుడితో మాట్లాడి, కిందికి తీసుకొచ్చి భద్రతా సిబ్బదికి అప్పగించారు. ఆ తర్వాత నీలాంకరై పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విజయ్‌కు 'వై' కేటగిరీ భద్రత ఉన్నప్పటికీ ఆయన ఇంటి టెర్రస్‌పైకి అగంతకుడు ఎలా చేరాడన్నదే ఎవరికీ అంతుచిక్కడం లేదు. మరోవైపు, ఆ అగంతకుడు ఏదేని పేలుడు పదార్థాలను అమర్చాడా? అనే విషయంపై బాంబు స్క్వాడ్ విజయ్ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, అలాంటివేమీ కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే, ఆ అగంతకుడిని నీలాంకరై పోలీసులు విచారించి, ఆ తర్వాత కీల్పాక్కంలోని ప్రభుత్వ మానసిక చికిత్రా కేంద్రానికి తరలించారు.

మైలాపూరు నాగేశ్వరరావు పార్కుకు
రూ.12.22 కోట్లతో నూతన సొబగులు



పార్కులో ఏర్పాటు కానున్న కిడ్స్ ప్లే ఏరియా - బ్యాడ్మింటన్ కోర్టు (ఊహాచిత్రం)



చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మైలాపూరు లజ్ ప్రాంతంలో స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, గాంధేయవాది, పత్రికాధిపతి దివంగత దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పేరుతో ఉన్న ఉద్యానవనాన్ని ఆధునికీకరించేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ సన్నద్ధమైంది. తేనాంపేట జోన్ 123వ వార్డు పరిధిలో ఉన్న నాగేశ్వరరావు పార్కును 'నమక్కు నామే' పథకం కింద రూ.12.22 కోట్లతో మరమ్మతులు చేయనుంది. ఆ మేరకు శుక్రవారం ఉదయం ఆ పార్కు వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ మరమ్మతు పనులను ప్రారంభించారు. 1949 అక్టోబర్ 20 ఈ పార్కును అప్పటి మద్రాసు ప్రావిన్స్ ప్రధాని పీఎస్ కుమారసామి రాజా ప్రారంభించారు. ఈ ఉద్యానవనానికి ఆ ప్రాంతంలోనే నివసిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పేరు పెట్టారు. నాలుగు ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ పార్కులో కమ్యూనిటీ పెవిలియన్, బ్యాడ్మింటన్ మైదానం, ఔట్‌డోర్ జిమ్, రెండు ప్రవేశ ద్వారాలున్నాయి. ప్రస్తుతం దీనిని గ్రీన్ ఫుట్‌ప్రింట్ పార్క్‌గా మెరుగపరచనున్నారు. ఎంట్రెన్స్ ప్లేస్, బ్యాడ్మింటన్ కోర్టు, ఫౌంటైన విత్ సీటింగ్స్ ఫౌంటైన్, విశ్రాంతిగదులు, మరుగుదొడు తదితర సదుపాయాలు కల్పించనున్నట్లు మంత్రి కేఎన్ నెహ్రూ వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ప్రియ, సౌత్ చెన్నై లోక్‌సభ సభ్యురాలు తమిళచ్చి తంగపాండ్యన్, మైలాపూరు ఎమ్మెల్యే డి.వేలు, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ జే కుమారగురుబరన్, కార్పొరేటర్ ఎం. సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావు పార్కులో అభివృద్ధిపనులకు భూమి పూజ చేస్తున్న నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, మేయర్ ప్రియ తదితరులు

సమాచార దృష్టి

29న పరమకుడికి సీఎం స్టాలిన్

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో ఈ నెల 29,30 తేదీల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటించనున్నారు. జిల్లాలో పూర్తిచేసిన అభివృద్ధి పనులు ప్రారంభించడంతో పాటు పలు పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం ఆయన 29వ తేది సాయంత్రం పరమకుడి చేరుకుని డీఎంకే నేతలతో సమావేశమవుతారు. రాత్రి 7.30 గంటలకు రామనాథపురంలో ఏర్పాటుచేసిన రోడ్‌షో పాల్గొంటారు. అనంతరం అక్కడి ప్రభుత్వ గృహంలో సీఎం బసచేయనున్నారు. మరుసటిరోజు ఉదయం రామనాథపురంలో రూ.20 కోట్లతో నిర్మించిన బస్‌స్టేషన్‌ను సీఎం ప్రారంభించనున్నారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రేపటితో కానిస్టేబుల్ పోస్టులకు గడువు పూర్తి

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు యూనిఫాం ఉద్యోగుల ఎంపిక బోర్డు ద్వారా 3,665 సెకండరీ గ్రేడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి గత నెల 21న నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు దరఖాస్తు సమర్పణ ఆదివారంతో ముగియనుంది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన రాత పరీక్ష నవంబరు 9వ తేది జరుగుతుందని అధికారులు తెలిపారు.

23 నుంచి ఏనుగుల శిబిరం మూసివేత

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముదుమలై ఏనుగుల శిబిరాన్ని ఈ నెల 23 నుంచి 26వ తేది వరకు మూసివేయనున్నట్లు అటవీ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇండియన్ టైగర్ అసెస్‌మెంట్ ట్రైనింగ్ నిర్వహించనున్న కారణంగా నాలుగు రోజులు శిబిరం సందర్శనకు పర్యాటకులను అనుమతించమని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో 42 పార్టీల గుర్తింపు రద్దు

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరేళ్లుగా ఎన్నికల్లో పోటీచేయని 42 పార్టీల గుర్తింపు రద్దు చేస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిషన్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరేళ్లుగా పోటీచేయకుండా, ఎన్నికల్లో పోటీచేసి ఖర్చు సమర్పించని రాష్ట్రానికి చెందిన42 పార్టీలు సహా దేశవ్యాప్తంగా 474 పార్టీల గుర్తింపు రద్దు చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది.

రూ.3,136 కోట్లతో ఆవడి-గూడువాంజేరి రైల్వే లైన్

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి-గూడువాంజేరి మధ్య రూ.3,136 కోట్లతో రైల్వే లైన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ సమగ్ర నివేదిక సిద్ధమైంది. ఫేస్-1లో గుడువాంజేరి-శ్రీ పెరుంబుదూర్-ఇరుంగాట్టుకోట మధ్య రూ.945 కోట్లతో 33.78 కి.మీ రైల్వే మార్గం ఏర్పాటుకానుంది. ఈ ప్రాజెక్ట్ కోసం 300 ఎకరాల భూసేకరణకు రూ.702 కోట్లు కేటాయించారు. ఈ నిధులను ఇండియన్ రైల్వే, రాష్ట్ర ప్రభుత్వం సమూర్చనున్నాయి. ఈ మార్గంలో 11 మేజర్, 83 మైనర్ బ్రిడ్జిలు, 16 రోడ్డు అండర్ బ్రిడ్జిలు, 56 లెవల్ క్రాసింగ్‌లతో ఆవడి, వలయనల్లూర్, తిరుమిళిసై, తండలం, శ్రీ పెరుంబుదూర్, వల్లకోట, ఒరగడం, నత్తరసన్‌పేట, గూడువాంజేరి రైల్వేస్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. 160 కి.మీ వేగంతో రైళ్లు వెళ్లేలా ఈ ప్రాజెక్ట్ రూపొందించినట్లు అధికారులు తెలిపారు.

విదేశాల్లో చదివే ముస్లిం విద్యార్థులకు ఉపకారవేతనం

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు వెళ్లి చదువుకునే 10 మంది ముస్లిం విద్యార్థులకు తలా రూ.36 లక్షల చొప్పు అందించేందుకు రూ.3.60 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పీజీ కోర్సులు చదివేందుకు 'క్యూఎస్ (క్వాక్వెరెల్లి సైమండ్స్)' ర్యాంకింగ్స్‌లో తొలి 250 స్థానాల్లో నిలిచిన విశ్వవిద్యాలయాలు, సంస్థల నుంచి షరతులు లేని అడ్మిషన్ లెటర్ పొంది ఉండాలి. అర్హులైన వారు www/bcmbcmw.tn.gov.in/welf-schemes_minorities.htm అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేసి, తగిన సర్టిఫికెట్లతో 'కమిషనర్, మైనార్టీ సంక్షేమ శాఖ, కలశ మహల్ హెరిటేజ్ బిల్డింగ్, మొదటి అంతస్తు, చేపాక్కం, చెన్నై-600005' అనే చిరునామాకు అక్టోబరు 31వ తేదిలోపు పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

23 నుంచి 'మిల్లెట్ ఉత్పత్తులు'పై శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'మిల్లెట్ బేకరీ ఉత్పత్తులు'పై ఈ నెల 23 నుంచి 26 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో రాగి చాక్లెట్ కేక్, జొన్న క్యారెట్ కేక్, ఫ్రూట్ బ్రెడ్, రాగి మిల్లెట్ బ్రెడ్, గోధుమ పిజ్జా, రాగి బ్లాక్ ఫారెస్ట్ కేక్, మిల్లెట్ వనిలీ కేక్, మిల్లెట్ బ్రౌనీ సహా పలురకాల ఉత్పత్తులు, బట్టర్ క్రీమ్ తయారీ, ప్యాకింగ్ తదితరాలు అందించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 18 ఏళ్ల పైబడిన యువతీ, యువకులు శిక్షణలో పాల్గొనవచ్చు. ఈకాట్టుతాంగళ్ సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంగణంలోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో పాల్గొనే యువతీ, యువకులకు తక్కువ ఛార్జీతో వేర్వేరుగా బస కల్పించనున్నారు. పేరు నమోదు, ఇతర వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 8668102600, 8072914694 నెంబర్లు సంప్రదించవచ్చు.

10కి కొడనాడు హత్య కేసు విచారణ వాయిదా

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ కేసుల విచారణ అక్టోబరు 10వ తేదీకి ఊటీ మేజిస్ట్రేట్ కోర్టు వాయిదావేసింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముద్దాయిలు గురువారం జరిగిన విచారణకు హాజరుకాలేదు. దీంతో, సీబీసీఐడీ డీఎస్పీ మురుగవేల్ తరఫున హాజరైన న్యాయవాది విజ్ఞప్తి మేరకు న్యాయస్థానం, ఈ కేసు విచారణ వాయిదావేసింది.

ఆరోసారి నిండిన వీరాణం చెరువు

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో 44 వేల ఎకరాలకు సాగు నీరు, నగరవాసుల దాహార్తిని తీర్చేందుకు తాగునీరందిస్తున్న వీరాణం చెరువు ఆరోసారి పూర్తిస్థాయిలో జలకళ సంతరించుకుంది. సెప్టెంబర్ 1న ఈ చెరువు ఐదోసారి పూర్తిగా నిండి, అదనపు జలాలను విడుదల చేయడంతో సేలం జిల్లాలోని మేట్టూరు జలాశయంలో నీటి మట్టం కూడా పూర్తి స్థాయికి చేరింది. ఈ చెరువు ఆయకట్టు కింద 44,856 ఎకరాల భూములకు సాగునీరు అందుతున్నాయి. ఇదే విధంగా చెన్నై నగరానికి సెకనుకు 73 ఘనపుటడుగుల చొప్పున భారీ పైప్‌లైన్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో వీరాణం చెరువు పరిసర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురవటంతో ఈ చెరువులోకి సెకనుకు 470 ఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశించాయి. శుక్రవారం ఉదయానికి ఆ చెరువు ఆరోసారి పూర్తిస్థాయిలో 47.40 అడుగుల మేర నిండింది. ప్రస్తుతం చెరువులో ఆరోసారి నీటిమట్టం పూర్తిస్థాయికి పెరగటంతో రైతులు హర్షం ప్రకటిస్తున్నారు. అదే సమయంలో చెరువులో నుండి సెకనుకు 274 అడుగుల చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

గిండి: లేబర్ కాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్, టీఎస్, మినీ, బాలాజీ నగర్, నాగిరెడ్డి గార్డన్, ఈకాట్టుతాంగళ్ గాంధీ నగర్ మెయిన్ రోడ్డు, సర్దార్ కాలని, జేఎన్ రోడ్డు, కలైమగళ్ నగర్, అచ్చుతన్ నగర్ 1వ మెయిన్ రోడ్డు, అరులయంపేట, సౌత్ అండ్ వెస్ట్ నార్త్ ఫేస్, ముత్తురామన్ వీధి, గణపతి కాలని, టిని సెక్టార్, లాజర్ వీధి

తాంబరం: మెప్స్

ఆవడి: గ్రీన్ ఫీల్డ్, సోమసుందరం అవెన్యూ, వెంకటాచలం నగర్, కమలం నగర్, లలితాంబాళ్ నగర్, అన్నై థెరిస్సా నగర్, వెంకటేశ్వర నగర్, ఒరగడం సొసైటీ

అళ్వార్ తిరునగర్: లక్ష్మీ నగర్, రాధా అవెన్యూ, ఏకేఆర్ నగర్, రాధా నగర్, వేలన్ నగర్ 5 నుంచి 9 వీధులు

సెంబియం: సింప్సన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, హోసూరు గార్డన్, ఐపీఎల్ కంపెనీ, బిమిటాల్ బేరింగ్, సింప్సన్, టఫే కంపెనీ, టీచర్స్ కాలని, సంతోష్ నగర్, వీనస్ నగర్, కడప రోడ్డు, సారధి నగర్, కలైమగళ్ నగర్, విల్లివాక్కం రోడ్డు, మూగాంబై నగర్

ఎగ్మూర్: హత్కిసన్ రోడ్డు, సింగర్ వీధి, సుబ్బయ్య వీధి, బారక్స్ రోడ్డు, సైడామ్స్ రోడ్డు, కర్పూర ముదాలి వీధి, తిరువేంగడం వీధి, ముటుక్కార వీరపర్దన్ వీధి, కాటూర్ సదయప్పన్ వీధి, ముత్తు గ్రామణి వీధి, చర్చ్ రోడ్డు, ఈవీకే సంపత్ రోడ్డు, జర్మియా రోడ్డు, పీహెచ్ రోడ్డు, కెల్లీస్ రోడ్డు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, బాల్ఫోర్ రోడ్డు, దామోదరన్ వీధి, బ్రాసన్ గార్డన్ వీధి, వెంకటపతి వీధి, హల్లీస్ రోడ్డు, ఎయిర్ ఇండియా కాలని, సుందరలాల్ నార్త్ అవెన్యూ, ఆర్చ్ రోడ్డు, లూథరన్ గార్డన్, పోలీస్ క్వార్టర్స్, వాసు వీధి, రాజరత్నం వీధి, డా.మునియప్ప రోడ్డు, ఈగ థియేటర్, ఎస్ఐ క్వార్టర్స్, కేజీ రోడ్డు, ఉమా కాంప్లెక్స్, బ్రాసన్ గార్డన్, బాల్ఫోర్ రోడ్డు

ఆయుధ పూజ, దీపావళి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయుధపూజ, దీపావళిని పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06151 చెన్నై సెంట్రల్-కన్నియాకుమారి వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 22,29, అక్టోబరు 6,13,20 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 11.50కు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.20 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06152 కన్నియాకుమారి- చెన్నై సెంట్రల్ వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 23,30, అక్టోబరు 7,14,21 తేదీల్లో కన్నియాకుమారిలో మధ్యాహ్నం 3.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.
- నెం.06153 చెంగల్పట్టు-తిరునల్వేలి ప్రత్యేక రైలు ఈ నెల 26,28, అక్టోబరు 3,5,10,12,17,19,24,26 తేదీల్లో చెంగల్పట్టు నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 11.55 గంటలకు తిరునల్వేలి చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06154 తిరునల్వేలి-చెంగల్పట్టు ప్రత్యేక రైలు ఈ నెల 26,28, అక్టోబరు 3,5,10,12,17,19,24,26 తేదీల్లో తిరునల్వేలి నుంచి ఉదయం 4 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 1.15 గంటలకు చెంగల్పట్టు చేరుకుంటుంది.

షెడ్యూల్ ప్రకారమే సెమిస్టర్ పరీక్షలు

● మంత్రి కోవి చెళియన్

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారమే సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని, అసెంబ్లీ ఎన్నికల కోసం ఇందులో ఎటువంటి మార్పులుండవని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ స్పష్టం చేశారు. తంజావూరులో శుక్రవారం ఉదయం ఎస్ఈటీసీ ఆధ్వర్యంలో ఐదు లో ఫ్లోర్ బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ పాలనలో అన్ని శాఖలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని, దివ్యాంగుల కోసం దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి పలు పథకాలు ప్రవేశపెట్టారని, ఆయన బాటలోనే స్టాలిన్ కూడా పనిచేస్తున్నారని తెలిపారు. దివ్యాంగులు సులువుగా ఎక్కి, దిగే విధంగా లో ఫ్లోర్ బస్సులు నడుపుతున్నామని, వీరు మాత్రమే కాకుండా వృద్ధులు, మహిళలు, పిల్లలు కూడా ఈ బస్సుల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణం చేస్తున్నారన్నారు. కళాశాలల సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను అన్నా విశ్వవిద్యాలయం రూపొందిస్తుందని, ఇందులో రాజకీయ పార్టీల జోక్యం ఉండదన్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల కారణంగా ముందుగానే సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలు అవాస్తవమని మంత్రి స్పష్టం చేశారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు: ప్రొఫెసర్ అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రొఫెసర్ కటకటాలపాలయ్యాడు. తిరుచ్చి కేకే నగర్‌కు చెందిన తమిళ్ (52) తిరుచ్చిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 13న తమిళ్ తన గదిలో ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు గురిచేసినట్లు సమాచారం. దీనిపై బాధితురాలు తరగతి టీచర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో తల్లిదండ్రులకు తెలుపడంతో వారు మనికండం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, ఈ కేసును తిరువెరుంబూర్ మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, తమిళ్‌ను అరెస్ట్ చేసి తిరుచ్చి మహిళా కోర్టులో హాజరుపరచి తిరుచ్చి జైలుకు తరలించారు. కాగా, విద్యార్థిని ఫిర్యాదుచేసినా పట్టించుకోని అసిస్టెంట్ ప్రిన్సిపాల్, తరగతి టీచర్‌పై చర్యలు చేపట్టాలనే ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు.

జయ రూ.36 కోట్ల పన్ను బకాయిల కేసు

● దీపా పిటిషన్ తోసివేత

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఆదాయపు పన్ను శాఖకు చెల్లించాల్సిన రూ.36 కోట్ల పన్ను బకాయి వ్యవహారంలో ఆమె వారసురాలు దీప దాఖలుచేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. జయ వారసులుగా ఆమె అన్న కుమార్తె దీపా, కుమారుడు దీపక్‌లను మద్రాసు హైకోర్టు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో జయలలిత, రూ.36 కోట్లు మేర ఆదాయపు పన్ను బకాయిలు ఉంచారు. ఆమె మరణానంతరం బకాయిలు చెల్లించాలని ఆమె వారసులకు ఆదాయపు పన్ను శాఖ నోటీసు జారీచేసింది. ఈ నోటీసు వ్యతిరేకిస్తూ దీప దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, నోటీసుపై స్టే విధించింది. ఈ నేపథ్యంలో, ఈ కేసు తుది విచారణ హైకోర్టు న్యాయమూర్తి సి.శరవణన్ ముందు శుక్రవారం విచారణకు వచ్చింది. ఐటీ శాఖ తరఫున హాజరైన న్యాయవాది... జయలలిత బకాయి ఉంచిన రూ.36 కోట్లు చెల్లించాలని దీపకు పంపిన నోటీసు వెనక్కి తీసుకుని రూ.13 కోట్లకు తగ్గించి మళ్లీ నోటీసు పంపించామని వివరించారు. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం, దీప పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది.

కాల్‌సెంటర్ పేరుతో రూ.2.30 కోట్ల మోసం

● ఇద్దరు మహిళల అరెస్టు

అడయార్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో నకిలీ కాల్ సెంటర్ పేరుతో రూ.2.30 కోట్ల మేర మోసం చేసిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే... పుదుచ్చేరి తిరుక్కనూరు ప్రాంతానికి చెందిన శంకర్ అనే వ్యక్తి మొబైల్‌కు రెండు నెలల క్రితం ఓ మహిళ ఫోన్ చేసి... ప్రముఖ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నానని, అతి తక్కువ వడ్డీకి రూ.50 వేల నుంచి రూ.14 లక్షల వరకు రుణం ఇప్పిస్తానని నమ్మించింది. దీంతో తన గుర్తింపు కార్డులన్నీ ఆ మహిళకు శంకర్ పంపించాడు. ఆ డాక్యుమెంట్లను పరిశీలించిన ఆ మహిళ మళ్లీ శంకర్‌కు ఫోన్ చేసి రూ.10 లక్షల రుణం మంజూరైందని, ఇది బ్యాంకు ఖాతాలో జమ చేయాలంటే రూ.71 వేలు ముందుగా చెల్లించాలని చెప్పగా ఆయన పలు దఫాలుగా ఆ మొత్తాన్ని చెల్లించాడు. ఆ తర్వాత ఆ మహిళను శంకర్ సంప్రదించలేకపోయాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన శంకర్ పుదుచ్చేరి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై లోతుగా దర్యాప్తు చేసిన సైబర్ వింగ్ చెన్నై రెడ్ హిల్స్ పుళల్‌లో న్యూ గోల్డెన్ ఎంటర్‌ప్రైజెస్ అనే పేరుతో నకిలీ కాల్ సెంటర్ నడుపుతున్నట్టు గుర్తించి, చెన్నై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన చెన్నై నగర పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్ళి శశికళ పెన్‌సెల్వి (37), పుళల్ శక్తివేల్ నగర్‌కు చెందిన మునిరాధ (27)లను అరెస్టు చేశారు. వీరి నుంచి 42 సిమ్ కార్డులు, 17 మొబైల్ ఫోనులు, రూ.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరు కలిసి రూ.2.30 కోట్ల వరకు మోసంచేసినట్టు విచారణలో తేలింది.

జిల్లాను పరిశుభ్రంగా ఉంచుదాం

● కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ

వేలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పరిశుభ్రం ఉంచేందుకు అందరూ కృషిచేయాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు, కార్పొరేషన్ మేయర్ సుజాత, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, 2వ మండల కమిటీ అధ్యక్షులు నరేంద్రన్, రిజిస్ట్రార్ తిరుగుణ అయ్యప్పదురై, కలెక్టర్ పీఏ (జనరల్) ముత్తయ్యన్ పాల్గొన్నారు.



ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వరకట్న వేధింపులు... భర్త, అత్త అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూలైమేడు ప్రాంతంలో వరకట్నం కోసం భార్యను హింసించిన భర్తను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. చూలైమేడుకు చెందిన సంగీత (26) తమిళనాడు విద్యుత్ బోర్డులో ఇంజనీర్‌గా పనిచేస్తున్న హరీస్ (28)ల వివాహం ఫిబ్రవరి 2న జరిగింది. వీరు చూలైమేడు ప్రాంతంలో ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. సంగీత తల్లిదండ్రులు వివాహ సమయంలో వంద సవర్ల నగలు అందజేశారు. అయితే, హరీస్, అతని తల్లి అదనంగా వంద సవర్ల నగలు, 2 కిలోల వెండి, ఇంటి స్థలం ఇవ్వాలని సంగీతను వేధిస్తున్నట్లు సమాచారం. వారి వేధింపులు తట్టుకోలేని సంగీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసి పోలీసులు, హరీస్, అతని తల్లిని గురువారం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

నీటమునిగి ఇద్దరు చిన్నారుల మృతి

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేట సమీపంలోని చిట్లపాక్కం చెరువులో మునిగి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. చిట్లపాక్కం తాంగస్‌కరై ప్రాంతానికి చెందిన లోకేష్ (13), చెల్లప్పన్ వీధికి చెందిన సంజయ్ (12) ఆ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వారు గురువారం పాఠశాలకు వెళ్లకుండా చెరువులో స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తున్న ఇద్దరూ లోతైన ప్రాంతంలో మునిగిపోయారు. గమనించిన చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని వారి కోసం చెరువులో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం మృతదేహాలు తీరానికి కొట్టుకొచ్చాయి. మృతదేహాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నియోమాక్స్ సంస్థపై ఫిర్యాదుకు 8 వరకు అవకాశం

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నియోమాక్స్ ప్రాపర్టీస్ సంస్థ కారణంగా మోసపోయిన డిపాజిటర్లు అక్టోబరు 8వ తేది వరకు ఆ సంస్థపై ఫిర్యాదు చేసేందుకు మద్రాసు హైకోర్టు అవకాశం కల్పించింది. ఈ సంస్థలో పెద్ద మొత్తంలో డిపాజిట్ చేసి మోసపోయిన వారు హైకోర్టును ఆశ్రయించారు. వీరి తరఫున దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం... బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అభినందించింది.ఈ వ్యవహారంలో నష్టపోయిన వారికి నష్టపరిహారం అందేలా ఫిర్యాదు స్వీకరణ గడువు అక్టోబరు 8వ తేది వరకు పొడిగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

నేడు 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని తేనాంపేట మండలం 126వ వార్డు మందవెల్లి జెత్ నగర్‌లో ఉన్న శ్రీమతి నారాయణి అమ్మన్ కల్యాణ మండపంలో శనివారం 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరం జరుగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాన్ని మండల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

గంజాయి కేసులో పదేళ్ల జైలు

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి తరలింపు కేసులో అరెస్టయిన ఆంధ్ర రాష్ట్రానికి చెందిన యువకుడికి కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధించింది. స్థానిక మింట్ బస్టాండ్ సమీపంలో 2022లో గంజాయి విక్రయించిన ఆంధ్ర రాష్ట్రం విశాఖకు చెందిన మంగరాజా (32)ను అరెస్ట్ చేసిన వాషర్‌మెన్‌పేట పోలీసులు, అతడి నుంచి 26 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు చెన్నై మాదకద్రవ్యాల తరలింపు నిరోధక ప్రత్యేక కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.రాజలక్ష్మి గురువారం తీర్పు వెలువరించారు.

రైళ్లు ఢీకొని ఇద్దరి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా కుళిత్తలై సమీపంలో రైలు ఢీకొని మహిళ మృతి చెందింది. ప్రమాదం చూసేందుకు వచ్చిన దివ్యాంగుడు మరో రైలు ఢీకొని మృతిచెందాడు. కుళిత్తలై సమీపంలో శుక్రవారం రైలు పట్టాలు దాటుతున్న అన్నకిళి (52) రైలు ఢీకొని ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ప్రమాదం చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల వారు అక్కడకు వచ్చారు. వారిలో బధిరుడైన రాజలింగం రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురు నకిలీ వైద్యుల అరెస్ట్

వేలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్హత లేకుండా వైద్యం చేస్తున్న ఆరుగురు నకిలీ వైద్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆరోగ్య శాఖ అధికారులు గుడియాత్తం, పేర్నాంబట్టు, కేవీ కుప్పం ప్రాంతాల్లోని క్లినిక్‌ల్లో తనిఖీలు చేపట్టారు. గుడియాత్తంకు చెందిన చెల్లియప్పన్ (51), తుకారామన్ (53), జ్యోతి ప్రియ (40), రేవతి (36), కేవీ కుప్పం ప్రాంతానికి చెందిన సెల్వరాజ్ (60), పేర్నాంబట్టుకు చెందిన బాబు (50) తగిన విద్యార్హత లేకుండా వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. వారిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి మందులు, ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈపీఎస్ పర్యటనలో మార్పు

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లాలో శనివారం పర్యటించాల్సిన ఎడప్పాడి పళనిస్వామి ప్రచారంలో మార్పులు జరిగాయి. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికలతో ఈపీఎస్ పర్యటనలో మార్పులు జరిగి, 20,21 తేదీల్లో జరగాల్సిన పర్యటన అక్టోబరు 4,5 తేదీలకు మార్చినట్లు అన్నాడీఎంకే తెలియజేసింది.

కేవీబీ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన ప్రచార ప్రారంభోత్సవంలో తిరుచ్చి పోలీసు కమిషనర్ కామిని

ప్యారీస్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) ఆధ్వర్యంలో 60 రోజుల సైబర్ నేరాలపై అవగాహన ప్రచారాన్ని తిరుచ్చి పోలీసు కమిషనర్ కామిని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిజిటల్ మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పాఠశాలలు, కళాశాలలు, వృద్ధాశ్రమాలు, పంచాయతీల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా ఎల్ఈడీ స్ర్కీన్లతో కూడిన మొబైల్ వాహనం ద్వారా 60 రోజులు జిల్లావ్యాప్తంగా ప్రచారం చేపట్టనున్నట్లు కేవీబీ అధికారులు తెలిపారు.

స్పా సెంటర్‌లో వ్యభిచారం: ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుగంబాక్కంలో ఉన్న స్పా సెంటర్‌లో వ్యభిచారం చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. విరుగంబాక్కం పోలీసులకు అందిన సమాచారం మేరకు గురువారం విరుగంబాక్కం నటేశన్ నగర్ కాళియమ్మన్ ఆలయ వీధిలోని ఓ స్పా సెంటర్‌లో తనిఖీలు చేపట్టి, వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో స్పా సెంటర్ మేనేజర్ కేకే నగర్‌కు చెందిన టి.శరవణన్, పల్లికరనైకు చెందిన ఎస్.శరవణన్, బ్రాడ్‌వే రాజాజీ రోడ్డుకు చెందిన కిషోర్ కుమార్‌ను అరెస్ట్ చేసి.. ఆ సెంటర్‌లో ముగ్గురు మహిళలను పోలీసులు రక్షించారు.

విద్యుదాఘాతంతో సోదరుల మృతి

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విల్లుపురంలో చెరకు నరికేందుకు వెళ్లిన సోదరులు విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. తిరువెన్నయనల్లూర్ సమీపం కొంగనాయనూరు గ్రామానికి చెందిన కుప్పన్ కుమారులు రామచంద్రన్ (33), చిన్నరసు (30)లు పెరుంపుగై గ్రామంలో రవి అనే వ్యక్తి తోటలో చెరకు నరికేందుకు వెళ్లారు. తోటలో కిందపడిన విద్యుత్ వైరు తగిలి ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హైకోర్టుకు బాంబు బెదిరింపు



హైకోర్టులో తనిఖీ చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టుకు మళ్లీ బాంబు బెదిరింపు వచ్చింది. శుక్రవారం వేకువజామున ఈమెయిల్ ద్వారా బెదిరింపు రావటంతో కోర్టు అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో హైకోర్టుకు వెళ్ళి తనిఖీలు నిర్వహించారు. న్యాయమూర్తుల గదులు, వివిధ న్యాయస్థానాలు, సిబ్బంది గదుల్లో సుమారు గంటకు పైగా తనిఖీలు జరిగాయి. చివరకు అది ఉత్తుతి బాంబు బెదిరింపు అని పోలీసులు నిర్ధారించారు. ఇదే రీతిలో గతవారం కూడా హైకోర్టుకు బాంబు బెదిరింపు వచ్చింది. అదే సమయంలో నగరంలోని ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో బాంబులు పేలుతాయని బెదిరింపులు వచ్చాయి. బాంబ్ స్క్వాడ్ నిపుణులు జాగిలాలతో వెళ్ళి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

శ్రీలంకకు తరలిస్తున్న బీడీ ఆకుల స్వాధీనం

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి గ్రేస్‌పురం ఉత్తర సముద్రతీరం నుంచి శ్రీలంకకు తరలించేందుకు సిద్ధం చేసిన బీడీ ఆకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రేస్‌పురం ఉత్తర సముద్రతీరం (పడవలకు మరమ్మతులు చేపట్టే ప్రాంతం) నుంచి శ్రీలంకకు పడవలో అక్రమంగా బీడీ ఆకులు తరలిస్తున్నట్లు క్యూ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ అనితకు సమాచారం అందింది. దీంతో సీఐ నేతృత్వంలో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతంలో ఏపకప లోడు వ్యాను నుంచి సుమారు 30 కిలోల బరువున్న 42 బస్తాల్లో బీడీ ఆకులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు, పడవలో సముద్రంలోకి వెళ్లి తప్పించుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏనుగు దాడిలో వృద్ధుడి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో ఏనుగు దాడిలో వృద్ధుడు మృతిచెందాడు. మసినకుడి సమీపం అక్కరై ప్రాంతానికి చెందిన మెత్తా (71) గురువారం సాయంత్రం 5.15 గంటలకు వాకింగ్‌కు వెళ్లాడు. మార్గంలోని వంతెన పక్కన ఉన్న ఏనుగు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి మెత్తాను తొండంతో తిప్పి విసిరేసింది. అంతలో అక్కడకు వచ్చిన వాహనచోదకులు పెద్ద శబ్దాలు చేస్తూ ఏనుగును అడవిలోకి తరిమివేశారు. తీవ్రంగా గాయపడిన మెత్తాను ఊటీ ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్సకు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై మసినకుడి అటవీ శాఖ అధికారులు విచారిస్తున్నారు.

అత్యాచారం కేసులో తండ్రికి 21 ఏళ్ల జైలు

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన కామాంధుడికి న్యాయస్థానం 21 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. స్థానిక ఆవడి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి (45), తన 11 ఏళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడినట్లు 2021 ఆగస్టు 15న అందిన ఫిర్యాదుతో ఆవడి మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి అతడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు తిరువళ్లూర్ జిల్లా ప్రత్యేక కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో నిందితుడికి 21 ఏళ్ల జైలుశిక్ష, రూ.30,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉమా మహేశ్వరి గురువారం తీర్పు వెలువరించారు.

ఓటరు జాబితా సంస్కరణలు అవసరం

● మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూడా ఓటరు జాబితా సంస్కరణ చేపట్టాల్సిన అవసరం ఉందని బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కోయంబత్తూర్‌లో గురువారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ... ప్రధాన మంత్రి మార్గదర్శకాలతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జీఎస్టీని తగ్గించి, ఆర్థిక విప్లవాన్ని అమలుచేశారన్నారు. జీఎస్టీ తగ్గింపుపై రాష్ట్ర ప్రభుత్వం కృతజ్ఞతలు కూడా తెలుపలేదన్నారు. నటుడు విజయ్ బీజేపీ కోసం విమర్శించడం తగ్గించి, డీఎంకేను వ్యతిరేకించడంలో తీవ్రం చేయాలని సూచించారు. అమిత్‌షాను కలుసుకుని బయటకు వచ్చిన సమయంలో, ఖర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నట్లు పళనిస్వామి చెబుతున్నా, ఆ విషయమై రాజకీయ లబ్ధి కోసం రాద్ధాంతాలు చేయడం తగదన్నారు.

వరద పరిస్థితులపై అప్రమత్తం చేస్తున్న అధికారులు



వేలూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం, జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా పొన్నై నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నీరు ప్రమాదస్థాయి దాటి ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. నదీ పరివాహక గ్రామాలైన పొన్నై, ఎరుకమ్‌పట్టి సహా పలు ప్రాంతాల్లో అధికారులు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రజలను హెచ్చరిస్తున్నారు.



డబ్బులిచ్చి దుష్ప్రచారం చేయిస్తున్నారు

● ప్రియాంకా మోహన్

తనకు వ్యతిరేకంగా కొందరు వ్యక్తులు డబ్బులిచ్చి మరీ దుష్ప్రచారం చేయిస్తున్నారని హీరోయిన్ ప్రియాంకా అరుల్ మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. 'డాక్టర్', 'డాన్', 'ఎదర్కుమ్ తుణిందవన్', 'కెప్టెన్ మిల్లర్' వంటి హిట్ చిత్రాల్లో నటించిన ప్రియాంకా.. అటు తెలుగులో పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ' చిత్రంలో నటించారు. ఈ చిత్రం ఈ నెల 25న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో తనపై మీమ్స్ రూపంలో జరుగుతున్న దుష్ప్రచారంపై ఆమె స్పందించారు. 'నేనంటే ఇష్టపడని కొందరు సోషల్ మీడియాలో మీమ్స్ పోస్ట్ చేస్తున్నారు. ఇలాంటి వాటికి కొందరు డబ్బులిస్తున్నారు. ఇలాంటి వాటికి నేను ఏమాత్రం భయపడను. ఎవరు మీమ్స్ పోస్ట్ చేసినా నాకేంటి' అని పేర్కొన్నారు.

రూ.వంద కోట్ల క్లబ్‌లో 'మదరాసి'


'మదరాసి'లో ఓ దృశ్యం

హీరో శివకార్తికేయన్ నటించిన 'మదరాసి' చిత్రం రూ.వంద కోట్ల క్లబ్‌లో చేరింది. 'డాక్టర్', 'డాన్', 'అమరన్' తదితర చిత్రాలు రూ.100 కోట్ల క్లబ్‌లో చేరగా, ఇపుడు 'మదరాసి' కూడా ఆ జాబితాలో నిలిచింది. ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, వద్యుత్ జమాల్, బిజూ మేనన్, సబీర్, విక్రాంత్ తదితరులు నటించగా, ఈ నెల 5వ విడుదలై రెండు రోజుల్లోనే రూ.50 కోట్లు, 14 రోజుల్లో రూ.100 కోట్లు రాబట్టినట్టు నిర్మాణ సంస్థ ప్రకటించింది. దీంతో ఈ మధ్యకాలంలో శివకార్తికేయన్ నటించిన అన్ని చిత్రాలు భారీగా వసూలు రాబడుతూ రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడం గమనార్హం. తమిళ చిత్రపరిశ్రమలో ఒకరిద్దరు అగ్రహీరోలు నటించిన చిత్రాలు మాత్రమే ఈ స్థాయిలో భారీ వసూలు చేస్తుండగా శివకార్తికేయన్ నటించిన నాలుగు చిత్రాలు వరుసగా రూ.వంద కోట్ల క్లబ్‌లో చేరడం గమనార్హం.

హాలీవుడ్ వెబ్ సిరీస్‌లో సిద్ధార్థ్



ప్రముఖ హీరో సిద్ధార్థ్ హాలీవుడ్ వెబ్ సిరీస్‌లో నటించనున్నారు. ఆయన నటించిన '3 బీహెచ్‌కే' మూవీ ఘన విజయం సాధించడంతో పాటు సినీ విమర్శకుల నుంచి కూడా మంచి ప్రశంసలు అందుకుంది. మంచి కలెక్షన్లను రాబట్టింది. అదేవిధంగా ఆయన ఓ పాత్ర పోషించిన 'ఇండియన్-3' మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో సిద్ధార్థ్ హాలీవుడ్ వెబ్ సిరీస్‌లో నటించేందుకు అంగీకరించారు. 'అన్‌కస్టమైజ్డ్ ఎర్త్' అనే పేరుతో రూపుదిద్దుకునే ఈ వెబ్ సిరీస్ మొత్తం 8 ఎపిసోడ్‌లు. తమిళం, తెలుగు భాషల్లో తెరకెక్కనుంది. రితేష్ భద్ర దర్శకుడు. వార్నర్ బ్రదర్స్ టెలివిజన్‌తో కలిసి జాన్‌వెల్స్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రేమ, సంస్కృతి సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిర్మించే ఈ వెబ్‌సిరీస్‌ను అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసేలా రూపొందించనున్నట్టు దర్శకుడు వెల్లడించారు. బాధ్యత కలిగిన ఒక గృహిణి.. తన మాజీ ప్రియుడిని చూడగానే ఆమె జీవితంలో చోటు చేసుకునే మార్పులు, ఒక వ్యాపారవేత్త తన బిజినెస్, ప్రేమ బ్యాలెన్స్ చేయలేక ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారన్న రెండు వేర్వేరు కథాంశాలను బ్యాలెన్స్ చేస్తూ రూపొందిస్తున్నట్టు దర్శకుడు వివరించారు.

చిత్రజ్యోతి


రోబో శంకర్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి - మక్కల్‌నీదిమయ్యం నేత కమల్‌హాసన్

రోబో శంకర్‌కు సినీ ప్రముఖుల నివాళి

అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన ప్రముఖ హాస్య నటుడు రోబో శంకర్ పార్థివ దేహానికి కోలీవుడ్ కు చెందిన అనేక మంది నివాళులర్పించారు. అగ్ర నటుడు కమల్ హాసన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, హీరోలు విజయ్ ఆంటోనీ, అరుణ్ విజయ్, ధనుష్, శివకార్తికేయన్, శింబు, దర్శకుడు టి.రాజేందర్ సహా నటుడు రాధారవి సినీ, బుల్లితెర నటీనటులు, ఆయన అభిమానులు వలసరవాక్కం రాధా అవెన్యూ లోని శంకర్ ఇంటికి వెళ్లి ఆయన నివాళులర్పించారు. రోబో శంకర్ మృత దేహానికి నివాళులర్పించిన తర్వాత ఉదయనిధి మీడియాతో మాట్లాడుతూ, 'రంగస్థల కళాకారుడిగా కెరీర్ ప్రారంభించి, బుల్లితెరపై విజయం సాధించి, సినీ పరిశ్రమంలోకి అడుగుపెట్టిన రోబో శంకర్ తమిళ ప్రేక్షకులను అలరించారు. తీవ్ర విషాదంలో మునిగిపోయిన ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులందరికీ తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. 'నన్ను వదిలి వెళ్ళిపోతావా నీవు' అంటూ అగ్ర నటుడు కమల్ హాసన్ భావోద్వేగంతో ట్వీట్ చేశారు. అలాగే, రోబో శంకర్ మృతిపట్ల సీఎం స్టాలిన్, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి దినకరన్, మాజీ సీఎం ఓ పన్నీర్‌సెల్వం, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, వీసీకే ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ నివాళులర్పించారు. కాగా, రోబో శంకర్ అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం వలసరవాక్కం బృందావన్ నగర్ విద్యుత్ దహనవాటికలో పూర్తి చేశారు.

రెండు భాగాలుగా 'ఎస్‌టీఆర్-49'

● వెట్రిమారన్ వెల్లడి


శింబు - వెట్రిమారన్

హీరో శింబు నటించే 49వ చిత్రం (ఎస్‌టీఆర్-49) రెండు భాగాలుగా రూపొందుతుందని, అయితే, ఈ చిత్రం షూటింగ్ ఎపుడు ప్రారంభమవుతుందో చెప్పలేనని దర్శకుడు వెట్రిమారన్ అన్నారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, 'ఎస్‌టీఆర్-49' కథ గంటా 15 నిమిషాల మేరకు రాశాను. మరో ఎపిసోడ్ పూర్తికావాల్సి ఉంది. ఈ సినిమాలో మొత్తం 5 ఎపిసోడ్లున్నాయి. ఏం చేస్తానో నాకే తెలియడం లేదు. ఈ సినిమా రెండు భాగాలుగా తెరకెక్కే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు. కాగా శింబు సినిమా పూర్తి చేసిన తర్వాత దర్శకుడు వెట్రిమార్.. హీరో ధనుష్‌తో 'వడ చెన్నై-2' ప్రాజెక్టు చేపట్టనున్నారు. మరోవైపు, వెట్రిమారన్ తీసే శింబు, ధనుష్ రెండు చిత్రాలు ఉత్తర చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుండటం గమనార్హం.

వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

తరుణి

● వైద్య సామాజిక సేవలో డాక్టర్ భానుప్రియ

జీవితంలో ఏదో సాధించాలని ఎంతోమంది అనుకుంటారు. ఆ సంకల్పానికి ఆదిలోనే ముగింపు పలుకుతారు కొందరు. లక్ష్యం సాధించేంతవరకు విశ్రమించరు మరికొందరు. ఆ కోవకు చెందినవారే డాక్టర్ భానుప్రియ. బాల్యంలోనే డాక్టర్ కావాలనే ఆమె కోరిక వయసుతో పాటు దృఢమైంది. అనుకున్నది సాధించి డాక్టరయ్యారు. అంతటితో ఆమె లక్ష్యం పూర్తవలేదు. చిన్నతనం నుండి సమాజసేవపై ఆసక్తి పెంచుకున్న ఆమె వైద్యురాలిగా రాణిస్తూ సమాజసేవను ప్రవృత్తిగా మార్చుకొని ఎంతోమందికి సేవ చేస్తూ, క్యాన్సర్ పట్ల అవగాహన కల్పిస్తూ, అహర్నిశలు శ్రమిస్తున్నారు డాక్టర్ భానుప్రియ. ఆమె వైద్య జీవన ప్రస్థానం నేటి 'తరుణి'లో.....



నిరుపేదల ఆశాకిరణం... క్యాన్సర్ బాధితుల పాలిట 'కల్పవృక్షం'

ప్రివరమ్ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ స్థాపన....

డాక్టర్ భానుప్రియ, డాక్టర్ మణికందన్ ఆలోచనల నుండి పుట్టిన హాస్పిటల్ ఇది. అవసరమే అన్వేషణకు మూలం అనే భావన నుంచి ఆవిర్భవించిన ఈ క్యాన్సర్ హాస్పిటల్ కరోనా మహమ్మారి సమయంలో క్యాన్సర్ రోగులకు భద్రమైన చికిత్స అందించడమే లక్ష్యంగా స్థాపించబడింది. ఆ సమయంలో చెన్నై నగరంలో ఒకవైపు ఆస్పత్రులలో బెడ్ల కొరత, మరోవైపు కొవిడ్ భయం ఈ విపత్కర పరిస్థితుల్లో క్యాన్సర్ రోగులకు భద్రమైన, మేలైన చికిత్స అందించే సదుద్దేశంతో ఈ హాస్పిటల్‌కి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా రేడియేషన్ అంకాలజీ, క్యాన్సర్ సర్జరీ, కీమోథెరపీ చికిత్సానంతర జాగ్రత్తలు, ఇలా ఎన్నో రకాల సేవలు ఈ హాస్పిటల్‌లో అందిస్తున్నారు.

వైద్యవృత్తిలో అనుభవం...

వలసరవాక్కంలోని ప్రివరమ్ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్‌పర్సన్‌గా, సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ అంకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు డాక్టర్ భానుప్రియ. చెట్‌పేట్‌లోని డాక్టర్ మోహతాస్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో కన్సల్టెంట్‌గా, అపోలో క్యాన్సర్ హాస్పిటల్, పల్లికరణైలోని కామాక్షి మెమోరియల్ హాస్పిటల్, బిల్‌రోత్ హాస్పిటల్, షెనాయ్‌నగర్‌లో కూడా ఆమె విజిటింగ్ కన్సల్టెంట్‌గా సేవలందిస్తున్నారు భానుప్రియ భర్త డాక్టర్ మణికందన్. ఈ దంపతులకు ఒక కుమార్తె.

భానుప్రియ పుట్టింది కోయంబత్తూరులో. తల్లి కోకిల, తండ్రి మోహన్. ఆమెకు ఒక సోదరుడు. భానుప్రియ పెరిగింది అంతా చెన్నైలోనే. పద్మాసారంగపాణి మెట్రిక్యులేషన్ స్కూల్‌లో ఆమె పాఠశాల విద్యాభ్యాసం జరిగింది. తూత్తుకుడి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివి, ఆ తరువాత చెన్నైలోని అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పీజీ పూర్తిచేశారు. అంకాలజీ టెక్నిక్స్ ఎన్నో నేర్చుకున్నారు. బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డు కూడా సాధించారు ఆమె. ఎండీ రేడియేషన్ అంకాలజీలో అత్యుత్తమ నైపుణ్యం ప్రదర్శించినందుకు డా.ఎంజీఆర్ మెడికల్ యూనివర్శిటీ ఆమెకు బంగారు పతకంతో గౌరవించింది. చదువుల్లో సరస్వతి అయిన భానుప్రియ వైద్యరంగంలో ఎన్నో డిగ్రీలు సాధించారు. సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ అంకాలజిస్ట్‌గా 14యేళ్లుగా సేవలందిస్తున్నారు.


కుంచె పట్టిన చిన్నారులతో...


విద్యార్థినులతో...

సాధించిన అవార్డులు....

- 2023లో వరల్డ్ స్కిల్‌కౌన్సిల్ సెంటర్ భారత్ సేవక్ సమాజ్ నుండి ఇంటలెక్ట్ అవార్డు...
- 2024లో. డా.రెడ్డీస్ ఫౌండేషన్ ఫర్ హెల్త్ ఎడ్యుకేషన్ హెల్త్ అంబాసిడర్‌గా...
- 2024లో. యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ భారత కళారత్న అవార్డు...
- సౌత్‌కొరియా బూసన్ క్రిస్టియన్ యూనివర్శిటీ ఫర్ ఫారిన్ స్టడీస్ నుంచి గౌరవ డాక్టరేట్....
- 5వ కాన్సర్ సదస్సులో ప్రతిష్ఠాత్మకమైన ఏక్‌వన్ రియలిస్టిక్ అవార్డు సహా ఎన్నో అవార్డులు ఆమె అందుకున్నారు.


క్యాన్సర్ కేర్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ భానుప్రియ


పరివు చారిటబుల్ ట్రస్టు అవార్డు అందుకుంటూ..

కల్పవృక్షం ట్రస్ట్...

బాల్యం నుండే సామాజిక సేవాదృక్పథం కలిగిన భానుప్రియకు వయసుతో పాటే సేవానిరతి కూడా అధికమైంది. డాక్టర్ కోర్సు చేస్తున్న సమయంలోనే ఆమె సమాజసేవకు గుర్తింపుగా 2009లో 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు పొందింది. తన విద్యకు సార్థకత కల్పించుకుంటూ వైద్య వృత్తిలో ముందుకు సాగుతూ, పేదలకు, ఆర్థికంగా వెనుకబడినవారికి గ్రామీణప్రజలకు క్యాన్సర్ సంబంధిత విషయాలపై అవగాహన కలిగించేందుకు, వారికి విద్యా, వైద్య రంగాల్లో ఆర్థికసాయం అందించేందుకు భానుప్రియ 'కల్పవృక్షం ట్రస్ట్' స్థాపించి, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్‌గా ఆమె వ్యవహరిస్తున్నారు. కల్పవృక్షం ట్రస్ట్ ద్వారా ఆర్థికంగా వెనుకబడివున్న విద్యార్థులకు విద్యనందించడం, మహిళలకు సాధికారత కలిగించటం, గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షలు నిర్వహించి ప్రాథమిక దశలోనే రోగాన్ని గుర్తించి వారికి చికిత్స నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కల్పవృక్షం ట్రస్ట్‌లో వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించడమే కాకుండా జబ్బు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతున్నారు భానుప్రియ. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి క్యాన్సర్ పై చైతన్యపరుస్తున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా ఎన్నో వేలమంది లబ్ధిపొందారని డాక్టర్ భానుప్రియ తెలిపారు.

"ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పట్ల అవగాహన కలిగివుండాలి. ముందస్తు పరీక్షలు చేయించుకుంటే ప్రాథమిక దశలోనే ఆ రోగాన్ని నిరోధించవచ్చు. ఆరోగ్యకరమైన జీవన విధానం కలిగి ఉంటూ. దేహానికి తగిన వ్యాయామాన్ని అందిస్తూ సానుకూల దృక్పథంతో ఉంటే క్యాన్సర్ బారిన పడకుండా నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది. ఆధునిక వైద్యవిధానాల ద్వారా క్యాన్సర్ నిర్మూలించవచ్చు. ఆశావహ దృక్పథంతో ఉంటే చికిత్సానంతరం కూడా ఆరోగ్యంగా నిండునూరేళ్లు జీవించేందుకు అవకాశం ఉంటుందని 'తరుణి'తో తన మనోభావాలు పంచుకు న్నారు భానుప్రియ.

కరుణాకర పెరుమాళ్‌పై సూర్యకిరణాలు

● పరవశించిన భక్తులు


పెరుమాళ్ విగ్రహంపై ప్రసరిస్తున్న ఉదయ భానుడి కిరణాలు

చెన్నై, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా అవినాశి సమీపంలో 1500 ఏళ్ల నాటి కరువూలర్ కరుణాకర పెరుమాళ్ మూలవిరాట్టుపై సూరకిరణాలు ప్రసరించడంతో భక్తులు పులకించిపోయారు. ఈ ఆలయంలో నవపాషాణంతో తయారైన శ్రీదేవీ, భూదేవీ సమేత కరుణాకర వెంకటరమణ పెరుమాళ్ ఆలయంలో పూజలందుకుంటున్నారు. ఈ ఆలయంలో ప్రతిరోజూ సూర్యకిరణాలు అర్థమండపంలోను, కొన్ని సమాయాల్లో మూలవిరాట్టు పాదాలపై ప్రసరిస్తుంటాయి. అయితే ఉత్తరాయణ కాలం ముగిసి దక్షిణాయన కాలం ప్రారంభంకానున్న పురటాసి రెండో తేదీ గురువారం ఉదయం 6.20 గంటలకు సూర్య కిరణాలు పెరుమాళ్ పాదాలపై పడ్డాయి. ఆ తర్వాత పెరుమాళ్ హృదయభాగంలో లక్ష్మీదేవి ఉన్న వక్షస్థలంపై ఆ కిరణాలు ప్రసరించాయి. ఈ దృశ్యాన్ని చూడడానికి వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. సూర్య కిరణాలు ప్రసరించినప్పుడు మూలవిరాట్టు స్వర్ణ కాంతులతో ప్రకాశిస్తుండడంతో భక్తులు పరవశించిపోయారు. ఇదే విధంగా శుక్రవారం ఉదయం కూడా సూర్య కిరణాలు మూలవిరాట్టుపై ప్రసరిస్తాయి.

నీలిరంగు నీటికి వీధి కుక్కలు భయపడతాయా...!

● హోసూరు ప్రజల వినూత్న ఆలోచన

పెరంబూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పలువురు వీధి కుక్కల బారిన పడుతున్నారు. కుక్క కాటుకు సరైన వైద్యం పొందక రేబిస్‌తో మృతిచెందిన ఘటనలు ఇటీవల జరుగుతున్నాయి. వీధి కుక్కల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినా, కుక్కలు ప్రజలపై దాడిచేయడం మాత్రం కొనసాగుతోంది. ఈ క్రమంలో, కృష్ణగిరి జిల్లా హోసూరు పట్టణ ప్రజలు వీధి కుక్కల బెడద నుంచి కాపాడుకునేలా సరికొత్త ఆలోచన చేశారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 45వ వార్డులో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. ఉదయం, సాయంత్రం వాకింగ్ వెళ్లే వారు వీధి కుక్కలు ఎక్కడ దాడిచేస్తాయోనని హడలిపోతున్నారు. ఈ నేపథ్యంలో, ఆ ప్రాంత ప్రజలు, దుస్తులు ఉతికేందుకు వినియోగించే నీలిరంగు నీటిలో కలిపి బాటిళ్లలో వేసి ఇళ్ల ముందుంచుతున్నారు. ఆ నీటిని చూసిన కుక్కలు భయపడి ఈ ప్రాంతానికి రావడం లేదని ప్రజలు తెలుపుతున్నారు.


ఇళ్ల ముందు ఉంచిన నీలి రంగు నీటి సీసాలు



సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను శుక్రవారం కలుసుకుని సీఎం సహాయ నిధికి రూ.9కోట్ల చెక్కును అందజేస్తున్న ఈక్వినిక్స్ ఇండియా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్‌పాల్


ఓట్ల చోరీని నిరోధించలేని కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కన్నియాకుమారిలో సంతకాలను సేకరిస్తున్న ఎంపీ విజయ్ వసంత్



టీటీడీకి విరాళంగా ఫాస్ట్‌ఫుడ్ వాహనం

తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): టీటీడీకి శుక్రవారం ఓ ఫాస్ట్‌ఫుడ్ వాహనం విరాళంగా అందింది. బెంగుళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య విద్యాసంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్ రామ్ రూ.14 లక్షల విలువైన వాహనాన్ని అందించారు. దీంతోపాటు టీటీడీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను, విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.




తిరుమలలో నటి ప్రేమ

తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి ప్రేమ, ఎమ్మెల్యే గుడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు లడ్డూ ప్రసాదాలు అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.70 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,095
తలనీలాలు సమర్పించినవారు: 23,932

ఆరోగ్యవరప్రసాదినికి రూ.10 లక్షలు



తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య పొలెపల్లి అనే భక్తుడు టీటీడీ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

శ్రీసిటీని సందర్శించిన హెచ్‌సీసీ బృందం



ప్రసంగిస్తున్న నిరీషా సన్నారెడ్డి

సత్యవేడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై హిందుస్థాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (హెచ్‌సీసీ)కు చెందిన 25 మంది ప్రతినిధుల బృందం (సీబిఐ) శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. ఇక్కడ వ్యాపార అనుకూల అవకాశాలు, పారిశ్రామిక సామర్థ్యాన్ని పరిశీలించింది. సంస్థ చైర్మన్ గోపినాథ్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తాతియా నేతృత్వంలో విచ్చేసిన హెచ్‌సీసీ బృందానికి శ్రీసిటీ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషారెడ్డి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు, వ్యూహాత్మక ప్రయోజనాలు, ఇతర ప్రత్యేకతలను శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ వివరించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ అధికారులతో చర్చల్లో పాల్గొన్న హెచ్‌సీసీ ప్రతినిధులు, వివిధ అంశాలపై నిశితంగా ఆరాతీసి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం డైకిన్, వరుణ్ బేవరేజెస్, ఎంఎస్ఆర్ గార్మెంట్స్ పరిశ్రమలను సందర్శించారు. కంపెనీల సాంకేతిక నైపుణ్యాలు, తయారీ విధానాలను పరిశీలించారు. సందర్శనకు సహకరించిన శ్రీసిటీ యాజమాన్యానికి గోపినాథ్, ప్రవీణ్ తాతియా కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ప్రణాళిక, పెట్టుబడి అనుకూల వాతావరణాన్ని కొనియాడారు. పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐఐటీలో నేడు రేపు కళా ఉత్సవం

ఏర్పేడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి ఐఐటీలో ఈనెల 20, 21 తేదీల్లో తిరుపతికి చెందిన ఆర్టిస్టా క్లబ్ ఆధ్వర్యంలో కళాంగిని పేరుతో ప్రత్యేక కళా ఉత్సవం జరగనుంది. ఈ వేడుకల్లో తిరుపతికి చెందిన మహిళా కళాకారిణులు స్టీల్ ఆర్ట్, నిర్మల్ ఆర్ట్ వంటి సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించనున్నారు. శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్న ఈ కళా ఉత్సవం ఆదివారం సాయంత్రం 5గంటలకు ముగుస్తుంది. శనివారం కళాఉత్సవం, వర్క్‌షాపులు, సీనరి పెయింటింగ్, ఫ్లోరల్ ఆర్ట్, పేపర్ డెకర్, పాట్ ఆడోర్నమెంట్ వంటివి నిర్వహించనున్నారు. అలాగే పెయింటింగ్‌పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. 21న ఆదివారం ఆర్ట్ ఎగ్జిబిషన్ జరగనుంది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ దివాకర్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. సంప్రదాయ కళాఖండాలు, వర్క్‌షాపులతో ప్రత్యేక ప్రదర్శనలు చేపట్టనున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు మూడేళ్ల జైలు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడి ఏడుగురు స్మగ్లర్లకు ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు, తలా రూ.20 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. మండలంలోని కారణిమిట్టకు చెందిన సమ్మిటి పెద్దగురవయ్య, కారణి రామయ్య, పిగిలి మోహన్, పిగిలి వెంకటయ్య, చెరివి శ్రీనాథ్, చెరివి రమణయ్య, వెంకటగిరి మునిరత్నంలను ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో 2016లో అప్పటి ఎస్ఐ హేమంత్‌కుమార్‌రెడ్డి అరెస్టు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారయణ సాక్ష్యధారాలను నిరూపించి నిందితులకు శిక్ష పడేలా చేశారు. శేషాచలం అడువుల్లో విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడివిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్థులకు ఇది హెచ్చరిక అని తిరుపతి ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఈ సందర్భంగా హెచ్చరించారు. నిందితులకు శిక్షపడేలా సహకరించిన శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, బీఎన్‌కండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడులను ఎస్పీ అభినందించారు.

రూ.13లక్షలు స్వాహా చేశారు

- ముగ్గురిపై సురేష్ ప్రొడక్షన్స్ మేనేజరు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సురేష్ ప్రొడక్షన్స్‌కు సంబంధించిన రూ.13 లక్షల నగదును స్వాహా చేసినట్లు ఆ సంస్థ మేనేజర్ నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని రెండు సినిమా హాళ్లను సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ లీజుకు తీసుకొని నడుపుతోంది. ఆ సినిమా హాళ్ల నుంచి వచ్చిన నగదును సురేష్ ప్రొడక్షన్స్ ఉద్యోగి సాయి బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తూ ఉంటాడు. మూడు నెలలుగా తక్కువ నగదు డిపాజిట్ చేసి బ్యాంక్ ఇచ్చిన రశీదును మార్చి యాజమాన్యానికి పంపేవాడు. ఇటీవల సురేష్ ప్రొడక్షన్స్ ప్రధాన కార్యాలయం సిబ్బంది పరిశీలించగా సాయి రూ.10 లక్షలు స్వాహా చేసినట్లు, అక్కడే పనిచేస్తున్న బాషా, మాకాని సాయి కలిసి రూ.3 లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎం ప్రారంభించనున్న పీఏసీ5 భవనాన్ని పరిశీలించిన ఈవో

తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతనంగా నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీఏసీ-5(వేంకటాద్రి నిలయం)ను టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం పరిశీలించారు. 25న సీఎం చంద్రబాబు ఈ భవనాన్ని ప్రారంభిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రాన్ని అధికారులు పరిశీలించారు. ఈవోతో పాటు సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, సీఈ సత్యనారాయణ ఉన్నారు.



మత్స్యకారుల్లో 'అల'జడి

- బతుకు నావకు కొరవడిన భద్రత
- ప్రమాద అంచున జెట్టి నిర్మాణం
- బోట్లు కొట్టుకుపోతాయని ఆందోళన





కోట మండలం గోవిందపల్లిపాళెం తీరం వద్ద జెట్టి ప్రమాదకరంగా ఉండటంతో ఒడ్డున నిలిపివేసి ఉన్న ఇంజన్ బోట్‌లు (ఫైబర్ బోట్) - గోవిందపల్లిపాళెం వద్ద స్వర్ణముఖి, చల్లకాలువ, బకింగ్‌హామ్ కెనాల్ కలిసేచోట నిర్మించి ఉన్న జెట్టి కోతకు గురై నీళ్లల్లో తేలుతున్న దృశ్యం

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ జీవనోపాధికి ఊతంగా నిలిచిన జెట్టి ప్రమాదపు అంచుకు చేరడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఏడెనిమిదేళ్లపాటు తమ బోట్ల భద్రతకు భరోసా ఇచ్చిన ఈ నిర్మాణం సాగరంలోకి కొట్టుకుపోతుందేనని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కోట మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధిలో గోవిందపల్లిపాళెం, శ్రీనివాస సత్రం గ్రామాలున్నాయి. గోవిందపల్లిపాళెం తీరం నుంచి నిత్యం 200కు పైగా ఇంజన్‌బోట్లతో ఈగ్రామాల మత్స్యకారులు వేటకు వెళ్తుంటారు. అయితే వేట తర్వాత తీరం చేరిన పడవలకు రక్షణ కొరవడేది. మత్స్యకార గ్రామాల ఎగువభాగం నుంచి స్వర్ణముఖి, చల్లకాలువ నదులతోపాటు బకింగ్‌హామ్ కెనాల్ ఉధృతంగా ప్రవహిస్తూ గోవిందపల్లిపాళెం వద్ద బోట్లు, వలలతోపాటు వేట సామగ్రిని ముంచెత్తేది. ఆటుపోట్లు, అలజడులు, ప్రకృతి విపత్తులకు ఇంజన్‌బోట్లు సముద్రంలోకి కొట్టుకుపోయేవి. దీంతో తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులు తిరిగి కొనుక్కునే స్థోమతలేక వేటకు వెళ్లలేక వీధినపడేవారు.

పాశం చొరవతో జట్టి నిర్మాణం

మత్స్యకారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని 2016లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ చొరవ తీసుకున్నారు. ఆర్ఐడీఎఫ్ కింద రూ.కోటి మంజూరు చేయించారు. ఈ నిధులతో ఇంజన్ బోట్ల రక్షణ కోసం గోవిందపల్లిపాళెం తీరంలో జెట్టిని నిర్మించారు. ఉధృత ప్రవాహాల నుంచి బోట్లు, వలలతోపాటు వేట సామగ్రి కొట్టుకు పోకుండా జెట్టి అడ్డుగోడగా నిలిచింది. ఫలితంగా మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గతేడాది వరద ఉధృతి జెట్టిని కూడా ముంచెత్తింది. దీంతో జెట్టి పూర్తిగా కోతకు గురైంది. నీటిమీద తేలియాడే పరిస్థితికి వచ్చింది. రక్షణ గోడలు, రింగ్‌బండ్‌లు లేకపోవడంతో చుట్టూ ఉప్పునీరు చేరి ఇది కూలిపోయే స్థితికి చేరింది.

అభద్రత తీరాన బోట్లు

ప్రమాదంలో పడిన జెట్టిపై నమ్మకంలేక మత్స్యకారులు విధిలేని పరిస్థితుల్లో తమ బతుకు ఆధారమైన బోట్లను తీరంవద్ద నిలిపేసి వెళ్తున్నారు. దేవుడి మీద భారం వేస్తున్నారు. ఏ క్షణంలోనైనా సాగరంలో తీవ్ర అలజడులు వచ్చినా, వరదనీరు ప్రవహించినా జెట్టి కొట్టుకుపోయేలా ఉందని వీరంతా ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జెట్టికి మరమ్మతులు చేపట్టి తమ బోట్లకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

8 కిలోమీటర్లలోపే చేపల వేట



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సముద్రతీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరం లోపు వరకే చేపల వేట సాగించాలని మత్స్యకారులకు తహసీల్దారు జయజయరావు, మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి సూచించారు. కోట మండలం గోవిందపల్లిపాళెం సముద్రతీరం వద్ద శుక్రవారం మత్స్యకారుల భద్రతపై మెరైన్, మత్స్యశాఖల ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో వీరు మాట్లాడారు. సముద్రంలోకి ఇతర ప్రాంతాల బోట్లు, అపరిచిత వ్యక్తుల సంచారం ఉంటే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. జెట్టి నిర్మాణ పనులకు రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. తుఫాను షెల్టర్ల తాత్కాలిక మరమ్మతులకూ నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అనంతరం గోవిందపల్లిపాళెం సముద్ర తీరంలో మత్స్యకారులతో కలసి అధికారులు విహరించారు. మెరైన్ ఎస్ఐలు నారాయణరెడ్డి, శివసౌమ్య, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌డీవో రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా ఆపండి

- ట్రాక్టర్ కింద పడుకొని అడ్డుకున్న గ్రామస్తుడు



ట్రాక్టర్ కింద పడుకొన్న బాపూజీ

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. వీటి జోరుకు ఇళ్లల్లోని పిల్లలు భయాందోళన చెందుతున్నారు' అంటూ చంద్రగిరి మండలం ఎగువ రెడ్డివారిపల్లెలో బాపూజీ అలియాస్ బాబ్జీ అడ్డుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఇసుక ట్రాక్టరు కింద పడుకున్నారు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో స్వర్ణముఖినది నుంచి ఇసుకతో ఆయన ఇంటి ముందు ట్రాక్టరు వెళ్తుండగా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్‌కి, బాపూజీకి కొంత వాగ్వాదం చోటుచేసుకొంది. శుక్రవారం ఉదయం కూడా యథావిధిగా ఇసుక ట్రాక్టర్లు తన ఇంటి ముందు పోతుండగా మళ్లీ బాపూజీ అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ దురుసుగా మాట్లాడారు. ఇసుక రవాణాకు ఎవరు అనుమతులు ఇచ్చారో చెప్పాలంటూ బాపూజీ డిమాండ్ చేశారు. తన ఇంటి ముందు ఇసుక ట్రాక్టర్ వెళ్లకూడదంటూ టైరు ముందు భాగంలో పడుకొన్నారు. ఎలా ట్రాక్టర్ నడుపుతావంటూ అడ్డుకున్నారు. అనంతరం డయల్ 100కి కాల్ చేయగా పోలీసులు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై బాపూజీ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారిస్తున్నారు.

మహిళల కోసమే వైద్యశిబిరాలు



చంద్రగిరి సీహెచ్‌సీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారి సశక్త్ అభియాన్ (ఆరోగ్య వంతమైన మహిళ- శక్తిమంతమైన కుటుంబం) పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసమే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయి. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబాన్ని బలపరిచే లక్ష్యంతో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం ప్రారంభమైన ఈ వైద్య శిబిరాలను అక్టోబరు 2వ తేది వరకు రెండు వారాల పాటు నిర్వహించనున్నారు. ఈవైద్య శిబిరాలకు మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ శిబిరాల్లో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వారికి సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేసేలా చర్యలు చేపట్టారు. 'మహిళ ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుంది. తల్లి ఆరోగ్యంగా ఉంటే పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు. మహిళా శక్తి సమాజ శక్తికి పునాది అవుతుంది' అనే నినాదంతో మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలలో వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నారు.

శిబిరాల్లో అందించే వైద్య సేవలివీ

మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి కాన్సర్, గర్భాశయ కాన్సర్‌కు పరీక్షల ద్వారా తగిన వైద్య చికిత్సలను, రెఫరల్ సేవలను అందిస్తున్నారు. మహిళలు, కిశోర బాలికలలో రక్తహీనతను గుర్తించడం, గర్భవతులను పరీక్షించి సరైన పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గర్భిణులకు ఎంసిపి కార్డ్‌లు అందజేస్తున్నారు. పిల్లలలో సికిల్ సెల్ అనీమియా గుర్తించి అవసరమైన వారికి చికిత్స చేస్తున్నారు. పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తారు. యుక్త వయస్సు బాలికలు, మహిళలకు బహిష్టు పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు అందిస్తున్నారు. ఈ శిబిరాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ సూచించారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులకూ నమోదు చేసుకోవాలన్నారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

పాకాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై శుక్రవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ సుదర్శన ప్రసాద్ తెలిపారు. పాకాల మండలానికి చెందిన ఆటో డ్రైవర్ శివ అలియాస్ అలీ (35) తొమ్మిదేళ్ల బాలికను గురువారం సాయంత్రం మాయమాటలతో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అసభ్యంగా ప్రవర్తించి బలాత్కారం చేయబోయాడు. బాలిక కేకలు వేయడంతో వదిలేశాడు. బాలిక ఇంట్లో చెప్పడంతో ఆటోడ్రైవరును గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుదర్శన ప్రసాద్ శుక్రవారం ఆటో డ్రైవర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

పాలెంపాడులో డీఎంహెచ్‌వో



దొరవారిసత్రం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పాలెంపాడు గ్రామాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ శుక్రవారం సందర్శించారు. ఇప్పటికే ఆ గ్రామంలో పలువురు కిడ్నీ సమస్యలతో మృతి చెందగా, దాదాపు 25 మంది కిడ్నీ సంబంధిత రోగాలతో బాధ పడుతున్నారు. ఇటీవల స్థానిక డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలోని వైద్య బృందం గ్రామస్తులకు రక్త పరీక్షలు చేయడంతోపాటు, నీటి నమూనాలను సేకరించి జిల్లా పరీక్షా కేంద్రానికి పంపారు. నీటి నాణ్యతలో లోపం లేదని తేలడంతో కిడ్నీ సమస్యలకు కారణాలను కనుగొనేందుకు అన్వేషణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో పాలెంపాడులో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రత్యేక వైద్య బృందాన్ని పంపి ఎందువల్ల కిడ్నీ సమస్యలు వస్తున్నాయో తేలుస్తామని చెప్పారు. స్థానిక వైద్యులు చైతన్య, లావణ్య ఉన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో 22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు



చెంగాళమ్మ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. 11 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే రోజుకొక ప్రాంతం నుంచి సారె సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవదాయశాఖ అధికారులు చేస్తున్నారు. ఉత్సవాల్లో అమ్మవారు 22వ తేదీన పరమేశ్వరి అలంకారం, 23న గాయిత్రి, 24న అన్నపూర్ణ, 25న అష్టకాళి, 26న మహాలక్ష్మి, 27న బాలత్రిపుర సుందరి, 28న చండి, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, 1న రాజరాజేశ్వరి, 2న మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో మహా చండీయాగం నిర్వహిస్తామని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

నానో ఎరువుల వాడకంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో కోరమాండల్ పరిశ్రమ వారు నానో ఎరువుల ప్రాముఖ్యత, వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రసాదరావు మాట్లాడుతూ యూరియా కొరతను అధిగమించడానికి వినియోగం తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాక వాటి వాడకంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందన్నారు. కోరమాండల్ ప్రైవేటు లిమిటెడ్ బిజినెస్ మేనేజరు స్వరూప్ దశలవారీగా నానో ఎరువుల వాడకం, నేల ఆరోగ్యం, పర్యావరణం గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ధనంజయరెడ్డి, జోనల్ మేనేజరు రమణారెడ్డి, సీనియర్ అగ్రానమిస్టు నర్సిరెడ్డి పాల్గొన్నారు.


తైక్వాండో కోచ్ గోపీనాయుడికి అవార్డు



గోపినాయుడికి అవార్డు, ట్రోఫీ అందజేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రిత్వ శాఖ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ సంస్థ తిరుపతికి చెందిన తైక్వాండో కోచ్ మాస్టర్ గోపినాయుడికి ప్రతిష్ఠాత్మక సుభాష్‌చంద్ర బోస్ ఐకాన్ 2025 అవార్డు ప్రదానం చేసింది. టీటీడీ విద్యాసంస్థలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందించింది. శుక్రవారం సాయంత్రం ఆయన టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన చేతుల మీదుగా అవార్డు, జ్ఞాపికను అందుకున్నారు.

30 కిలోల గంజాయి స్వాధీనం : నలుగురి అరెస్టు



గంజాయి సీజ్ చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... ఒడిశా రాష్ట్రం రానాలి గ్రామానికి చెందిన డీన్ చాందిని, దానుపాణి, జోసెఫ్ బర్దాన్ తిరుపతిని కేంద్రంగా చేసుకుని గంజాయి వ్యాపారం సాగిస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి తమిళనాడులోని స్మగ్లర్లకు విక్రయిస్తున్నారు. శుక్రవారం అందిన రహస్య సమాచారం మేరకు రామతులసి కల్యాణ మండపం వద్ద తమిళనాడు తిరునల్వేలి జిల్లా కొక్కిరాకులం గ్రామానికి చెందిన ఎం.ముత్తువేలు గంజాయి తీసుకెళుతుండగా ఈస్ట్ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో కలసి పట్టుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు ఒడిశాకు చెందిన డీన్ చాందిని, దానుపాణి, జోసెఫ్ బర్దాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.